క్లుప్తంగా

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం



పాత గుంటూరు: సంపత్ నగర్ శ్రీ రామనామ క్షేత్రంలో 97వ శ్రీ రామకోటి మహోత్సవం, వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. క్షేత్రం గౌరవ అధ్యక్షులు పోలిశెట్టి హరిప్రసాద్, ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి, మస్తాన్‌రావు దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు క్రోసూరి మురళీ కృష్ణమాచార్యులు వరపూజ చేసి, మేళతాళాలతో ఉత్సవమూర్తుల్ని కల్యాణ వేదికకు చేర్చారు. విష్వక్సేనారాధనతో ప్రారంభించి మాంగల్య పూజ అనంతరం మంగళసూత్ర ధారణ చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్న ప్రసాద వితరణ చేశారు. శ్రీ రామదాసు కీర్తనల్ని చింతలపాటి రామమహేశ్వరి, ఇమ్మడి అంజనీదేవి ఆలపించారు. సాయంత్రం పోటీల్లో పాల్గొన్న బాలబాలికలకు బసవరాజు జయశంకర్ బహుమతులు ప్రదానం చేశారు. గరుడ వాహనంపై సీతారాముల కల్యాణమూర్తుల నగరోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. లీలాసుందరి మాట్లాడుతూ శనివారం ఉదయం సహస్ర నాగవల్లీ దళార్చన, సాయంత్రం నగరోత్సవం ఉంటాయని తెలిపారు. కార్యక్రమాల్ని కె. రామచంద్ర ప్రభు, కె.శాంతి భూషణ్, డాక్టర్ వి. రాఘవరావు పర్యవేక్షించారు.

హిందూ కళాశాలలో స్మారక ప్రతిభా పురస్కారోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్లోని హిందూ కళాశాలలో శుక్రవారం బద్దెపూడి ముకుందరావు స్మారక ప్రతిభా పురస్కార ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వాణిజ్య విభాగ ఆధ్వర్యంలో పాఠ్యాంశాలతో పాటు సాంస్కృతిక పరమైన అంశాల్లో విద్యార్థులకు పోటీల్ని నిర్వహించారు. విజేతలతో పాటు చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థిని షేక్ అఫ్రీన్ బానుకు రూ.ఐదువేల నగదు బహుమతిని బద్దెపూడి ముకుందరావు కుటుంబ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ బి.లక్ష్మీ బద్రీనాథ్, డాక్టర్ బి. లీలామోహన్, రాజీవ్, దత్తప్రసాద్, సోమశేఖర్, టి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ పి.ఎం. ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.ఎస్. దుర్గాప్రసాద్, కామర్స్ ఇన్‌చార్జ్ ఐ. శాంతిలత పాల్గొన్నారు.

చర్చ లేకుండా బిల్లులు ఆమోదించడం అప్రజాస్వామికం

లక్ష్మీపురం: పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో 146 మంది ఎంపీలను బహిష్కరించి పదికి పైగా బిల్లుల్ని చర్చ లేకుండా ఆమోదించడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతలు, ఆర్థిక సమస్యలు, విశ్వవిద్యాలయాలు, మీడియా తదితర అంశాలపై ప్రవేశపెట్టబడిన బిల్లులు సామాన్య ప్రజల జీవితాల్ని ఎలా ప్రభావితం చేస్తాయనే విషయం తెలియకుండా ఆమోదించడం ప్రజాస్వామ్య విలువల్ని తాకట్టు పెట్టినట్లేనని తెలిపారు. న్యాయవాది అవధానుల హరి, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకానికి సంబంధించి ఆమోదించబడిన బిల్లుతో ఎన్నికల వ్యవస్థ మొత్తం ప్రభుత్వం చేతుల్లోకి వెళ్లినట్లేనని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సీనియర్ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు జిల్లా ప్రాజెక్టు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు గుంటూరు జిల్లా టీం ఎంపికైనట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ శుక్రవారం తెలిపారు. వైఎస్సార్ కడప జిల్లాలో ఈనెల 28, 29వ తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థులు ప్రతిభ చాటినట్లు చెప్పారు. మంగళగిరిలోని సీకేజీఆర్‌సీ పాఠశాలకు చెందిన విద్యార్థులు మహాలక్ష్మి, ఎస్.నాగ చైతన్య తయారు చేసిన మల్టీపర్పస్ వీల్‌చైర్ ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వివరించారు. విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ బి. టైటాస్‌ను ఆమె అభినందించారు. అభినందించిన వారిలో జిల్లా సైన్స్ అధికారి అడుసుమల్లి రవి కుమార్ పాల్గొన్నారు.

జనవరి 12,13 తేదీల్లో ఎస్టీయూ వజ్రోత్సవాలు

పెదకాకాని: ఎందరో త్యాగధనుల పోరాట చరిత్ర రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) సొంతమని గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కె. సుబ్బారెడ్డి పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో జనవరి 12,13 తేదీల్లో నిర్వహించనున్న ఎస్టీయూ వజ్రోత్సవాల వాల్‌పోస్టర్లు, కరపత్రాల్ని పెదకాకాని విద్యా వనరుల కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించారు.



పార్కులో విద్యుత్ వెలుగుల శోభ



ఆకర్షిస్తున్న చదరంగం ప్లే బోర్డు



చిన్నారుల ఆటలు

నగర ప్రజలకు హాయి.. హాయిగా!

- గుంటూరుకే మణిహారంగా గాంధీ పార్కు
- గత నెల 10న ప్రారంభం
- రూ.6.25 కోట్లతో ఆధునీకరణ
- పిల్లల ఆహ్లాదం కోసం పలు ఆటల సామగ్రి ఏర్పాటు
- అదనంగా సిబ్బంది నియామకం



పార్కులో చిన్నారుల ఆటలు



కనువిందు చేస్తున్న జిరాఫీలు

నెహ్రూనగర్: నగరానికి గాంధీ పార్కు మణిహారమనే చెప్పుకోవచ్చు. నగర నడిబొడ్డున 6.50 ఎకరాల విస్తీర్ణంలో ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందిస్తూ మన్ననలు పొందుతోంది. గత టీడీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అంద విహీనంగా మారింది. వైఎస్సార్ సీపీ పాలకవర్గం అధికారంలోకి వచ్చిన తరువాత పార్కు అభివృద్ధికి కంకణం కట్టుకుంది. రూ.6.25 కోట్లతో ఆధునిక హంగులతో, చిన్నారుల ఆట వస్తువులతో పార్కును గత నెల 10న పునఃప్రారంభించారు.

పార్కుకి ఘన చరిత్ర

నగరంలోని గాంధీ పార్కుకి ఘన చరిత్ర ఉంది. స్వాతంత్రోద్యమ సమయంలో గాంధీజీ ఈ ప్రాంతంలోనే సమావేశం ఏర్పాటు చేశారు. మొదట్లో స్వరాజ్ మైదానంగా పిలిచే వారు. ఆ తరువాత గాంధీ పార్కు అని పెట్టారు. 1938లో గడియార స్తంభాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దాన్ని కూడా పూర్తిస్థాయిలో ఆధునీకరించారు.వైఎస్సార్ సీపీ పాలకవర్గం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.6.25 కోట్లతో చిన్నారుల కోసం ప్రత్యేకంగా ఆట వస్తువులు, వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. వీటిలో ప్రధానంగా జంగిల్ బుక్, వేస్ట్ టు వండర్, గుంటూరు ఎక్స్‌ప్రెస్ ట్రైన్, చెస్ బోర్డు, సెల్ఫీ పాయింట్లు, పిల్లల కొరకు సాఫ్ట్ ప్లే ఎక్విప్‌మెంట్, బటర్ ఫ్లై జోన్, సీటింగ్ ప్లాజాలు, పార్టీ లాన్, పెద్దల కోసం ఓపెన్ జిమ్ పరికరాలు, ఎంట్రెన్స్ గేట్, లైటింగ్, వింగ్స్ పాయింట్ తదితరాలతో అందంగా ఆకర్షణీయంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు.



గుబాళిస్తున్న రోజ్ గార్డెన్

చిన్నారుల ఫీల్డ్ ట్రిప్‌కు ఉపయోగకరం



నగరంలో విశాలమైన స్థలంలో పార్కును ఆధునీకరించడం బాగుంది. చిన్నారుల పుస్తకాల్లో అంశాలను ప్రాక్టికల్‌గా చూపించేందుకు గాంధీ పార్కు ఉపయోగకరంగా ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆడుకునేందుకు ఆట వస్తువులు బాగున్నాయి.

– మహిముదా, లక్ష్మి, గీత, శ్రీలక్ష్మి, జాస్సిలిన్, ప్రయివేట్ స్కూల్ టీచర్లు

ఆడుకునేందుకు బాగుంది



గాంధీ పార్కులో ఆడుకునేందుకు వీలుగా బోలెడు పరికరాలు ఉన్నాయి. జంగిల్ బుక్, చెస్ బోర్డు, సాఫ్ట్ ప్లే ఎక్విమెంట్‌లో చాలా బాగా ఆడుకున్నా. స్కూల్‌కి సెలవు వచ్చిన ప్రతిసారి పేరెంట్స్‌తో పార్కుకి వచ్చి ఆడుకుంటా.

– సిద్ధార్థ, 5వ తరగతి, కొరిటిపాడు

పార్కులో అదనపు సౌకర్యాల కల్పన



గుంటూరు గాంధీ పార్కును పూర్తి స్థాయిలో పిల్లలకు, పెద్దలకు ఆహ్లాదకరంగా ఉండేలా అన్ని హంగులతో తీర్చిదిద్దాం. ప్రారంభం అయిన నాటి నుంచి ప్రజల నుంచి విశేష ప్రజాదరణ చూరగొంటుంది. పార్కులో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక సిబ్బందిని కేటాయించాం. సందర్శకులకు మంచినీటి వసతి కూడా కల్పిస్తున్నాం.

– కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్

పన్నులు చెల్లించేందుకు రెండు రోజులే గడువు

నెహ్రూనగర్: వడ్డీ లేకుండా ప్రస్తుత అర్ధ సంవత్సరానికి గానూ పన్నులు చెల్లించడానికి రెండు రోజులు మాత్రమే గడువు ఉందని, పన్ను చెల్లింపుదార్లకు అనుకూలంగా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31 ఆదివారం చివరి రోజు సెలవు అయినప్పటికీ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయన్నారు. జనవరి 1 నుంచి పన్ను బకాయిపై వడ్డీ పడుతుందని పేర్కొన్నారు. పన్ను చెల్లింపునకు వీలుగా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయంల్లోని క్యాష్ కౌంటర్లతో పాటు అదనంగా నగరంలోని భారత్ పేట 140 సచివాలయం, వసంతరాయపురం 148 సచివాలయం, పెద్ద పలకలూరు రోడ్డులోని 106 సచివాలయాల్లో కూడా ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. నగరపాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి, నీటి, ఖాళీ స్థలం పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.

బాబూ ఆపు నీ నాటకం- జగనే మా నమ్మకం



నవరత్నాల పత్రాలను అందజేస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణ కుమారి ఆధ్వర్యంలో సాయినగర్‌లో శుక్రవారం 'బాబూ ఆపు నీ నాటకం–జగనే మా నమ్మకం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 79వ వార్డు సచివాలయ కన్వీనర్ ఉపేంద్రరెడ్డి, 22వ క్లస్టర్ గృహ సారథులు గడప గడపకూ వెళ్లారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అమలు పరుస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

రూ.28.50 లక్షల ఖరీదైన మొబైల్‌ఫోన్లు అప్పగింత

- వందమంది బాధితులకు ఊరట
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్



మొబైల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్పీకె.ఆరిఫ్‌హఫీజ్, చిత్రంలో ఏఎస్పీలు సుప్రజ, శ్రీనివాసరావు

నగరంపాలెం: చోరీకి గురైన మొబైల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని ప్రతి నెల్లో వంద మందికి పైగా అప్పగిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ తెలిపారు. సుమారు రూ.28.50 లక్షలు ఖరీదైన వివిధ రకాల బ్రాండెడ్ కంపెనీ మొబైల్‌ఫోన్లను శుక్రవారం బాధితులకు జిల్లా పోలీస్ కార్యాలయ(డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారి సౌకర్యార్థం పోలీస్ వాట్సాప్ నంబర్ 8688831574 ను అందుబాటులోకి తీసుకొచ్చామని అన్నారు. ఈ నంబర్‌కు 'హాయ్' అని మేసేజ్ పంపిస్తే, ఇతరత్రా వివరాలను నమోదు చేసుకుంటారని చెప్పారు. తద్వారా ఫోన్‌ను గుర్తించేందుకు ఐటీ కోర్ నిమగ్నమవుతుందని పేర్కొన్నారు. ఒక్కొక్కసారి పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు పొరుగు రాష్ట్రాల్లో ఉన్నప్పటికీ, వాటిని తీసుకొచ్చి బాధితులకు అప్పగిస్తున్నామని తెలిపారు. వాట్సాప్ నంబర్ ప్రారంభించిన కొద్దినెలల్లోనే మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు రూ.2.50 కోట్ల ఖరీదు చేసే బ్రాండెడ్ కంపెనీల మొబైల్‌ఫోన్లను బాధితులకు అప్పగించినట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. సీఈఐఆర్ పోర్టల్‌లోనూ ఫిర్యాదు నమోదు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. పోలీస్ వాట్సాప్ నంబర్, సీఈఐఆర్ పోర్టల్‌ను జిల్లా ప్రజలతోపాటు ఇతరత్రా జిల్లాలోని ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. రోజుల వ్యవధిలో మొబైల్ ఫోన్ పోయిందని, వాట్సాప్ నంబర్‌కు ఫిర్యాదు చేయడంతో వెంటనే గుర్తించి అప్పగించడం ఆనందంగా ఉందని బాధితుల్లో ఒకరు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐటీ కోర్ టీం నోడల్ అధికారిణి, జిల్లా ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ, ఏఎస్పీ (క్రైం) ఎ.శ్రీనివాసరావు, డీఎస్పీలు బాలసుందరరావు(ట్రాఫిక్), రత్నస్వామి(ఎస్‌బీ), ఎస్‌బీ సీఐ ఎస్‌వీ రాజశేఖర్‌రెడ్డి, ఐటీ కోర్ ఏఎస్ఐ రాందాస్‌రెడ్డి, సిబ్బంది కరిముల్లా, రమేష్ పాల్గొన్నారు.

ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికైన వెంకటసుబ్బారెడ్డికి అభినందన

నగరంపాలెం: జిల్లా పోలీస్ కంట్రోల్ రూంలో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్(పీసీ నంబర్ 5429) ఎస్.వెంకటసుబ్బారెడ్డి ఎస్ఐ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఆయన్ను శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఏఎస్పీలు కె.సుప్రజ (పరిపాలన), శ్రీనివాసరావు (ఎల్/ఓ), ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), ఎస్‌బీ డీఎస్పీ రత్నస్వామి, సీఐలు శివప్రసాద్ (కంట్రోల్ రూం), ఎస్‌వీ.రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసరావు (ఎస్‌బీ), ఎస్పీ సీసీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మేనిఫెస్టోనే సీఎం జగన్‌కు పవిత్ర గ్రంథం



ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తున్న నూరిఫాతిమా

పట్నంబజారు: ఎన్నికల సమయంలో అలివికాని హామీలివ్వడం.. ఆఖరికి మేనిఫెస్టో కనపడకుండా చేయడం టీడీపీకి కొత్తేమి కాదని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా విమర్శించారు. తూర్పు నియోజకవర్గంలోని 17వ డివిజన్ ఇందిరా కాలనీలో శుక్రవారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందజేసిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు, ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ఈ సందర్భంగా నూరిఫాతిమా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను ఒక పవిత్ర గ్రంథంగా భావిస్తారు కాబట్టే.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని తెలిపారు. మంచి చేస్తేనే ఓటు వేయండి అని అడిగే ధైర్యం సీఎం జగన్‌కు తప్పా.. రాష్ట్రంలో మరే పార్టీకి లేదని స్పష్టం చేశారు. చంద్రబాబు అబద్ధాలను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఫర్జానా, వైఎస్సార్ సీపీ నేతలు మదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, జి. నాగేశ్వరరావు, బికారి మేస్త్రి, వెంకటేశ్వరరెడ్డి, భాగ్యలక్ష్మి, నరసమ్మ, మురళి పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

తూర్పు నియోజకవర్గంలోని రెండో డివిజన్ మణిపురంలోని బొర్రా నాగేశ్వరరావు నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు షేక్ నూరి ఫాతిమా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మర్రి అంజలి, వైఎస్సార్ సీపీ నేత మర్రి సత్యన్నారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిర్చి యార్డులో ముగిసిన సద్ది వితరణ



సద్ది స్వీకరిస్తున్న మాలధారులు

కొరిటిపాడు: గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో మాలధారణ స్వాములకు గత 45 రోజుల నుంచి నిర్విఘ్నంగా కొనసాగిన సద్ది వితరణ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా శరణు ఘోషతో మిర్చి యార్డు ప్రాంగణం మార్మోగింది. గణపతి హోమం, అయ్యప్ప నామ సంకీర్తనలతో పూర్తి ఆధ్యాత్మిక వాతావరణంతో భక్తి భావం వెల్లి విరిసింది. సద్ది వితరణ ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమంలో సేవ చేసిన వారికి శాసన మండలి విప్, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో వస్త్ర దానంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ అత్యంత వైభవోపేతంగా పడిపూజ, నిత్య సద్ది వితరణ కొనసాగించి, సమాజ హితాన్ని కాంక్షించిన దేవస్థానం కమిటీ, మిర్చి ఫ్యామిలీని ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. కార్యక్రమంలో శ్రీ వరసిద్ధి వినాయక దేవస్థానం ఆలయ కమిటీ నిర్వాహకులు, మిర్చి ఫ్యామిలీ మెంబర్స్ కొత్తపల్లి శివసాంబిరెడ్డి, కోటా సాంబశివరావు, కుర్రి సాంబిరెడ్డి, కొత్తూరి సుధాకర్, లేళ్ల పెద్ద అప్పిరెడ్డి, యలమంచిలి పుల్లారావు, వి.జి.టి.నారాయణరావు, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, పాదిలి శ్రీనివాసరావు, గోపు శ్రీనివాసరెడ్డి, కార్మిక నేత ఎం.శ్రీనివాసరెడ్డి, బొలిశెట్టి వెంకట రమేష్‌కుమార్, డొంకెన బలరాం పాల్గొన్నారు.

మాదక ద్రవ్యం కేసులో విచారణ పూర్తి

నగరంపాలెం: 'మాదక ద్రవ్యం' కేసులో ఆరోపణల దృష్ట్యా త్వరలో సిబ్బందిపై వేటుపడనుంది. ఇప్పటికే ఎస్ఐ, కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపించగా, సదరు పోలీస్ అధికారిని జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లో రిపోర్ట్ చేయాలని ఆదేశించిన సంగతి తెలిసిందే. తూర్పు సబ్ డివిజన్‌లోని ఓ పోలీస్‌స్టేషన్ (పీఎస్) పరిధిలో రెండు వారాల క్రితం ఎండీఎం డ్రగ్‌తో ఉన్న ఓ కుర్రాడ్ని ఎస్ఈబీ (సెబ్) పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం అతడిని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. దీంతో అతన్ని ఫోన్ కాల్ డేటా ఆధారంగా చేసుకుని పలువురిని విచారించారు. ఈ విచారణలో సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలో స్టేషన్ అధికారిని జిల్లా పోలీస్ కార్యాలయంలో రిపోర్టు చేయాలని, ఎస్ఐ, కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపించారు. దీంతో సదరు పోలీస్ అధికారితోపాటు పలువురిపై విచారణకు గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు ఆదేశించారు. ఈ క్రమంలో ఏఎస్పీ శ్రీనివాసరావుతో పాటు పోలీస్ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. అయితే, విచారణ పూర్తికావడంతో నివేదికను జిల్లా పోలీస్ అధికారికి నివేదికను అందజేసినట్లు సమాచారం.

విద్యార్థి కేంద్రంగా బోధన సాగాలి: డీవైఈఓ



మాట్లాడుతున్న డీవైఈఓ వెంకటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: తరగతి గదిలో విద్యార్థి కేంద్రంగా అత్యుత్తమ విద్యాబోధన సాగాలని గుంటూరు డీవైఈఓ పి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్షా భవన్‌లో ఉర్దూ పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు రెండు రోజులపాటు నిర్వహించిన జిల్లాస్థాయి శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణా శిబిరాన్ని సందర్శించిన డీవైఈఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులకు శిక్షణ తరగతుల్ని నిర్వహిస్తూ, వృత్తి నైపుణ్యం పెంపునకు కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఉర్దూ పాఠశాలల్లో విద్యార్థులకు మాతృ భాషతో పాటు ఆంగ్లభాషలోనూ పాఠ్యాంశాలను మిర్రర్ ఇమేజ్ టెక్నాలజీతో అందించిందని చెప్పారు. తద్వారా విద్యార్థులు పోటీ ప్రపంచంలో రాణించేందుకు ఊతం ఇస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, పాఠశాల హెచ్‌ఎం ఎస్వీఆర్ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్థిరమైన లక్ష్యం ఎంతో అవసరం



డాక్టర్ రామకృష్ణ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులకు స్థిరమైన లక్ష్యం ఎంతో అవసరమని, లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించాలని యూఎస్ఏకు చెందిన న్యూరో సైన్స్ పరిశోధకుడు డాక్టర్ ఎం. రామకృష్ణ సూచించారు. జేకేసీ కళాశాల రోడ్డులోని డాక్టర్ కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్లో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు 'భవిష్యత్తులో జీవన ఉపాధి అవకాశాలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ సీబీఎస్ఈ విద్యా విధానంలో చదవడం వల్ల విద్యార్థులకు భవిష్యత్తు చక్కగా ఉంటుందని తెలిపారు. సృజనాత్మక, తార్కిక పద్ధతి అభివృద్ధి చెందడంతో పాటు విషయంపై అవగాహన పెరుగుతుందని వివరించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం ప్రకారం విద్యార్థుల్లో ఏ పోటీ పరీక్షల్లో పాల్గొనాలన్నా, అది సీబీఎస్ఈ సిలబస్‌లోనే ఉంటుందని చెప్పారు. సీబీఎస్ఈ విద్యా విధానం విద్యార్థులకు ఒక చక్కటి బాటను ఏర్పరచుతుందని తెలిపారు. ప్రిన్సిపాల్ వై. రధిసీచౌదరి మాట్లాడుతూ విద్యార్థులు టెన్త్ వరకు సీబీఎస్ఈ విద్యా విధానంలో చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ కె. వెంకట్రావు, పి. నాగ సుశీల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డీఆర్‌ఎం కార్యాలయంలో సువిధ కేంద్రం ప్రారంభం

నూతన విభాగాన్ని పరిశీలించిన డీఆర్‌ఎం రామకృష్ణ



సీనియర్ డీపీఓ షేక్ షాహబాజ్ హనూర్‌ను అభినందిస్తున్న డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి సువిధ కేంద్రం ఎంతో ఉపయోగమని డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ పేర్కొన్నారు. స్థానిక పట్టాభిపురంలోని డివిజన్ కార్యాలయంలో నూతనంగా సువిధ కేంద్రాన్ని డీఆర్‌ఎం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నూతన సిబ్బంది, పెన్షనర్ల ఫిర్యాదులు, దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేందుకు వీలుంటుందని పేర్కొన్నారు. సువిధ కేంద్రం ఏర్పాటుకు డివిజన్ సీనియర్ డీపీఓ షేక్ షాహబాజ్ హనూర్ కృషి అభినందనీయం అని చెప్పారు. ఫిర్యాదుల పరిష్కారానికి వీలుగా గడువు నిర్ణయించాలని సూచించారు. డివిజన్‌లోని ప్రధానమైన అంశాలను డిజిటల్, ప్రచారాని అవసరమయ్యే ఇతర కార్యక్రమాలను ప్రదర్శించడానికి కార్యాలయ ప్రాంగణంలో పోస్టర్లు, ప్రదర్శనలకు బదులుగా త్వరలో నాలుగు టీవీ డిజిటల్ స్క్రీన్‌లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇటీవల జరిగిన పెన్షన్ అదాలత్‌లో రిటైర్డ్ సిబ్బందికి వాట్సాప్ గ్రూప్, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ నంబర్‌ను తీసుకొచ్చినందుకు వ్యక్తిగత శాఖను డీఆర్‌ఎం అభినందించారు. సెలవు రికార్డు డిజిటలైజేషన్‌ను దాదాపుగా పూర్తి చేసినందుకు ఆర్‌పీఎఫ్ శాఖను ప్రశంసించారు. కార్యక్రమంలో సీనియర్ డీపీఓ షేక్ షాహబాజ్ హనూర్, ఏడీఆర్‌ఎం సైమాన్, వివిధ విభాగాల అధికారులు ప్రభాకరరాజు, జె.వి.అనూష, అమూల్య బి.రాజ్, బి.లక్ష్మణ్, దినేష్ రెడ్డి, కె.కమలాకర్, హరప్రసాద్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చాంద్‌బాషా

గుంటూరు మెడికల్: కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ వేగవంతం చేయాలని యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్ బాషా ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు వైద్య కళాశాల ఆవరణలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు ఉద్యోగులందరికీ నూతన పీఆర్సీ 2020 స్కేల్స్ వర్తింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులలో ఆనందాన్ని, వారి కుటుంబ సభ్యుల్లో నూతన వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.వి.ఎస్. శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కరీముల్లా షాఖాద్రి, జిల్లా ఉపాధ్యక్షుడు రవి కుమార్, నగరశాఖ ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, ఓపీఎస్ సాధన సమితి డెప్యూటీ కో-ఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.